క్లుప్తంగా

పేదల పెన్నిధి సీఎం జగన్



ఫిరంగిపురం: పేదల పెన్నిధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ అన్నారు. మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజలకు చేసిన సేవలు, అందిన పథకాలకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వి.రాము, హేమలతారెడ్డి ,నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు

ఫిరంగిపురం: ఎన్నికలు నిర్వహించే బూత్‌లకు సమీపంలో నిర్వహించే వైద్య శిబిరాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయన్ అన్నారు. మండలంలోని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, ఫిరంగిపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 13న పోలింగ్ బూత్‌ల వద్ద నిర్వహించే వైద్య శిబిరాల జాబితా, సిబ్బంది వివరాలు, అందజేయాల్సిన మందులు వంటి వివరాలు వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. నుదురుపాడు పీహెచ్‌సీ పరిధిలో 17బూత్‌లకు గాను 12 వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి యానిగ్రేస్ తెలిపారు. సంబంధిత మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలో 17 బూత్‌ల వద్ద వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి శ్వేత వివరించారు. ఎంపీహెచ్‌ఈవో శివగణేష్, పీహెచ్‌ఎన్ గాయత్రీదేవి, సీహెచ్‌వో వెంకటలక్ష్మీ, వెంకటరమణలు ఉన్నారు.

రెండు గ్రామాల్లో వైద్యశిబిరాలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్, గుండాలపాడు గ్రామాల్లో శుక్రవారం నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. గుండాలపాడులో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారి ఫరీనాబేగం 207 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. అమీనాబాద్ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 202 మందికి వైద్య పరీక్షలు చేశారు. వేసవి కాలంలో గర్భిణులు, బాలింతలు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే

సీఎం జగన్ సంకల్పం

- జగనన్న సంక్షేమ పథకాలు కుటుంబాలకు ఆసరాగా మారాయి
- సాక్షి ముఖాముఖిలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



తాడికొండ: ఒక్క అవకాశం ఇవ్వండి.. మీ కష్టంలో, సుఖంలో మీ మనిషిగా అందుబాటులో ఉండి సేవ చేస్తానని ఎమ్మెల్యే, మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత అన్నారు. అమరావతి ఎక్కడికో వెళ్లిపోతుందని ప్రతిపక్షాల ప్రచారం తప్పని, అమరావతి శాసన రాజధానిగా ఇక్కడే ఉంటుందన్నారు. రేపు గెలిచిన అనంతరం రాష్ట్రంలోని ఎమ్మెల్యేలంతా ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల సమానాభివృద్ధే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్ష అని విభేదాలన్నీ చక్కబెట్టి సొంత నియోజకవర్గంలో ప్రణాళికా బద్ధంగా ముందుకెళుతూ విజయానికి చేరువలో ఉన్నానని సాక్షి ముఖాముఖిలో ఆమె తన మనోభావాలను వెల్లడించారు.

ప్రశ్న: మీ సొంత నియోజకవర్గం తాడికొండలో పోటీచేసే అవకాశం రావడం పట్ల మీరు ఎలా ఫీలవుతున్నారు?

జవాబు: చాలా సంతోషంగా ఉంది. అలా అని ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని మరిచిపోలేను. అక్కడి ప్రజలు నన్ను 15 సంవత్సరాలు ఆదరించి గుండెల్లో పెట్టుకొని సొంత ఆడపడుచులా చూసుకున్నారు. సొంత నియోజకవర్గంలో పోటీచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను.

ప్రశ్న: మీరు కొత్తగా నియోజకవర్గ బాధ్యతలు తీసుకున్న తరువాత పట్టు సాధించగలిగారా?

జవాబు: నేను వచ్చేటప్పటికి చాలా సమస్యలు రాజధాని ప్రాంతంలోనూ, నియోజకవర్గంలోనూ ఎదురు చూస్తున్నాయి. కొన్ని సమస్యలకు సీఎం గారి సహాయ సహకారాలతో పరిష్కారం అందించగలిగాను. నేను వచ్చేటప్పటికి ఒక్క మంచినీటి చెరువులో కూడా నీళ్లు లేవు. తాగునీటి సమస్య చాలా అధికంగా ఉంది. ఇప్పుడైతే చెరువులన్నింటినీ ఎన్ఎస్‌పీ అధికారులతో మాట్లాడి నింపించి ఎక్కడా కూడా తాగునీటి సమస్య లేకుండా చేయగలిగాను. రాజధాని ప్రాంతంలో రైతు కూలీల సమస్యలు ఏవైతే చెప్పారో చెప్పిన వెంటనే సీఎం గారి దృష్టికి తీసుకెళ్లగా జీవన భృతి పింఛన్ రూ.2,500 నుంచి రూ.5వేలకు పెంచి కేవలం 14 రోజుల్లో జీవో ఇచ్చి సమస్య పరిష్కారం చేశారు.

ప్రశ్న: అమరావతి రైతుల సమస్యలు, డిమాండ్‌లు మీ దృష్టికి ఏమైనా తెచ్చారా?

జవాబు: నేను డిశంబర్‌లో సమన్వయకర్తగా ఇక్కడకు వచ్చాను. డిసెంబర్‌లో వలంటీర్స్‌కు వందనం కార్యక్రమం ఫిరంగిపురం మండలంలో సీఎం గారు పెట్టడం జరిగింది. అప్పుడు నేను ఓపెన్ డయాస్ మీద చెప్పడం జరిగింది. దానికి సీఎం గారు వెంటనే స్పందించారు. 14 రోజుల్లోనే జీవో ఇవ్వడం జరిగింది. అంటే సీఎం గారి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కారం జరిగింది. తక్కువ సమయంలో ఎక్కువ సమస్యలు పరిష్కారం చేశామని నేనైతే అనుకుంటున్నాను. వాళ్ల సమస్యను నేరుగా తీసుకెళ్లి సంప్రదింపులు జరిపినట్లయితే ఇంత తీవ్రతరమయ్యేది కాదనేది నా ఉద్దేశ్యం.

ప్రశ్న: తాడికొండ ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ ఇక్కడ అమరావతి వాదం బలంగా ఉందని అంటున్నారు మీరేమంటారు?

జవాబు: వాస్తవానికి కొంతమంది అసైన్డ్ రైతులు రాజధాని ప్రాంతంలో ఉన్నారు. వాళ్లకి రావాల్సిన కౌళ్లు రాలేదు. అంతే కాకుండా వాళ్లకి సంబంధించి సమస్యలు కొన్ని ఉన్నాయి. అన్నీ సీఎంగారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అవన్నీ కోర్టు పరిధిలో ఉండటం వల్ల వాటి జోలికి వెళ్ళలేము కాబట్టి దానికి ఏ విధంగా బయటకు తీసుకొచ్చి న్యాయం చేయగలము అనేది వెంటనే చేస్తాం.

ప్రశ్న: నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ఏమి గుర్తించారు. భవిష్యత్తులో మీ ప్రణాళిక ఎలా ఉండబోతుంది?

జవాబు: వాస్తవానికి నేను సమస్యలు పరిష్కరించడానికి ఇక్కడ కేవలం అభ్యర్థినే కానీ ఎమ్మెల్యేను కాను. సమన్వయ కర్తగా వచ్చాను. నా దృష్టికి వచ్చిన సమస్యలు ఏమైతే ఉన్నాయో అవన్నీ కూడా సీఎం గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాను. ప్రధానంగా మా ఫిరంగిపురంలో కొండపై ఉన్న కార్మెల్ మాత ఆలయానికి ఘాట్ రోడ్డు అడిగాను. దానికి రూ.39 కోట్లు కేటాయిస్తూ సీఎం గారే స్వయంగా హామీ ఇవ్వడం జరిగింది. అందుకు సంబంధించి పనులు మొదలు పెట్టడానికి కోడ్ వచ్చింది. ఫిరంగిపురంలో స్మశానం చాలా ఇరుకైపోయింది. సమస్యను ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చినపుడు కొండ పోరంబోకు ఖాళీగా ఉంది.. మొక్కలు మొలిచి అధ్వాన్నంగా ఉంటే జంగిల్ క్లియరెన్స్ చేసి వాళ్లు రెండెకరాలు అడిగితే నేను 4 ఎకరాలు కేటాయింపజేసి స్మశానంగా వాడుకోవడానికి ఇవ్వడం జరిగింది. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నదే సీఎం జగన్ ఆశయం. ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళతాం.

మంగళగిరిలో

మార్మోగిన జగన్నినాదం

- సీఎం జగన్ సభకు ఉప్పొంగిన ప్రజాభిమానం
- అభిమానుల రాకతో జన సంద్రంగా మారిన మంగళగిరి
- సభ విజయవంతంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్



మంగళగిరిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న లావణ్య

మంగళగిరి: పట్టణంలోని గౌతమబుద్ధా రోడ్డులో శుక్రవారం జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో ఆయనపై ప్రజాభిమానం మరోసారి ఆవిష్కృతమైంది. ప్రజలు భారీగా తరలి రావడంతో పాటు జై జగన్ నినాదాలతో మంగళగిరిలో జరిగిన సిద్ధం సభ దద్దరిల్లింది. నియోజకవర్గ ప్రజలు పోటెత్తడంతో గౌతమబుద్ధా రోడ్డుతో పాటు పట్టణంలోని పలురోడ్లు కిటకిటలాడాయి. సీఎం జగన్ సభ పది గంటలకే ప్రారంభమవుతుందని తెలుసుకున్న ప్రజలు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి ర్యాలీలు చేపడుతూ సభాస్థలికి చేరుకున్నారు. గౌతమబుద్ధా రోడ్డు సభకిరువైపులా బారులు తీరి సీఎం జగన్ ప్రసంగాన్ని ఆసక్తిగా విన్న జనం జై జగన్ అంటూ నినాదాలు చేయడంతో మంగళగిరి మార్మోగింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించగా సీఎం జగన్ హాజరై బీసీ సామాజిక వర్గానికి చెందిన తన సోదరి లావణ్యను గెలిపించి చట్ట సభకు పంపించాలని కోరారు. సీఎం జగన్ ప్రసంగం పార్టీ నాయకులతో పాటు ప్రజలను విశేషంగా ఆకట్టుకోవడంతో ఆ ప్రాంతం జై జగన్ నినాదాలతో మార్మోగింది. సిద్ధం సభకు హాజరైన జనాన్ని చూసిన టీడీపీ నాయకులు మంగళగిరిలో లోకేష్‌కు మరోసారి పరాభవం తప్పదని చర్చించుకోవడం విశేషం. సిద్ధం సభ వైఎస్సార్ సీపీ శ్రేణులలో జోష్ నింపగా టీడీపీ శ్రేణులను నిరాశకు గురి చేసిందని నియోజకవర్గ ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

మళ్లీ జగన్‌బాబే సీఎం కావాలి



జగన్‌బాబును చూడాలనే కుంచనపల్లి నుంచి వచ్చాను. ఇప్పటి వరకు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు ఇస్తూ మాలాంటి వృద్ధులకు ఎలాంటి కష్టం లేకుండా ఆయన చూసుకుంటున్నాడు. ఈ రోజు సభకు వచ్చిన జనం చూసిన తర్వాత మళ్లీ జగనే సీఎం అవుతాడనే నమ్మకం ఉంది.

ఎం మణెమ్మ, కుంచనపల్లి

చంద్రబాబు వస్తే కరువు తాండవం తప్పదు



పేదల బతుకులు మారాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలి. రాజధాని పేరుతో రైతులను నాశనం చేసిన ఘనత చంద్రబాబుది. రాజధాని అంటూ ఒక్క ఇటుక కట్టకుండా 33 వేల ఎకరాలను బీడు చేశారు. చంద్రబాబు వస్తే కరువు తాండవం తప్పదు. అందుకే జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలి.

పల్లబోతు రామచంద్రరావు, కురగల్లు

జగనన్నతోనే మా లాంటి పేదలకు మేలు



జగనన్న సీఎం అయిన తర్వాత అందుతున్న పథకాలతో సంతోషంగా ఉండడంతో పాటు పిల్లలను చక్కగా చదివించుకుంటున్నాము. అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా పెన్షన్ ఇలా అన్ని పథకాలను ఇస్తున్న జగనన్నను చూడాలనే వచ్చాము.

కూరపాటి జ్యోతి, ఆత్మకూరు

నిడమర్రులో కోలాహలంగా లావణ్య ప్రచారం



నిడమర్రులో ప్రచారం నిర్వహిస్తున్న లావణ్య

మంగళగిరి: వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య శుక్రవారం రాత్రి నగర పరిధిలోని నిడమర్రులో ప్రచారం నిర్వహించారు. లావణ్యకు మాజీ సర్పంచ్ మండెపూడి మణెమ్మ ఆధ్వర్యంలో ఘన స్వాగతం అభించగా స్థానికులు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్లి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి, మండెపూడి మాణిక్యాలరావు, యోహాను, నాగరాజు, కర్రి భాస్కర్, మండెపూడి బుజ్జి, శేషిరెడ్డి, గాదె సాగర్‌రెడ్డి, కొమ్మారెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీలంతా జగన్ వెంటే

ముస్లిం మైనార్టీలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎండి ఇక్బాల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం ఇంటింటికి తిరిగి వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని కోరారు. అధికారంలోకి వస్తే మైనార్టీల రిజర్వేషన్లు తొలగిస్తామని చెప్పడం దారుణమన్నారు.

నేడు రేవేంద్రపాడులో..

మంగళగిరి: వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య శనివారం ఉదయం 7 గంటల నుంచి దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులో ప్రచారం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రచారంలో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు పాల్గొంటారని తెలిపారు.